క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామంలో గురువారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మాజీ జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు అందజేశారు. కార్యక్రమంలో గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనారాయణ, నాగరాజు, అబ్బల్, విజయ్, కాశయ్య, మాలీస్ రాజు, గజ్జెల జీవన్ ఉన్నారు.

పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మల్లూర్ గ్రామ పంచాయతీలో గురువారం ఇంటి పన్నుల వసూళ్లకు పంచాయతీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సుమారు రూ. 10వేల పన్నులు వసూలు చేసినట్లు కార్యదర్శి సంతోష్ తెలిపారు. ప్రజలందరూ పనులను చెల్లించి, గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

రైతులకు రుణమాఫీ చేస్తాం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సౌధగర్ గంగారాం పేర్కొన్నారు. గడప గడపకు కాంగ్రెస్‌లో భాగంగా మండలంలోని అంజని గ్రామంలో గురువారం ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు అరవింద్, ప్రణయ్‌రెడ్డి, డీసీసీ డెలిగేట్ మహేందర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు నాంధేవ్, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. బుధవారం నాటికి 3లక్షల 37వేల 398 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా క్రషింగ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా కళాశాల వార్షికోత్సవం



మాచారెడ్డి: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం గురువారం ఉత్సాహంగా కొనసాగింది. ఈసందర్భంగా విద్యార్థులు పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ అందరిని అలరించారు. కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజమౌళి గుప్తా, ముత్యాల లక్ష్మి, నర్సింహారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ నర్సింహారెడ్డిలు మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, దోమకొండ కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాచారంలో వైద్య శిబిరం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని యాచారంలో సేవాలాల్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ నీల సురేందర్, నాయకులు శంకర్ నాయక్, మంగ్యానాయక్, చందర్ నాయక్, గోప్య నాయక్, వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మండలంలోని భవానీపేట జెడ్పీ పాఠశాలలో గురువారం కామారెడ్డి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు 120 మంది విద్యార్థులకు నేత్ర, దంత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ నర్సింహం, కార్యదర్శి గంగాధర్‌లు తెలిపారు. అలాగే లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు 10వ తరగతి విద్యార్థులకు డిక్షనరీలు అందజేశారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ



బాన్సువాడ రూరల్: పట్టణంలోని భవిత కేంద్రంలో గురువారం దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యుడు గంగాధర్ చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్స అందించారు. ఐఈఆర్‌పీ అర్జున్, సిబ్బంది ఉన్నారు.

దళారులకు పంటను విక్రయించొద్దు

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే
- జుక్కల్‌లో శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



మద్నూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ ప్రతినిధులు



జుక్కల్‌లో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌సింధే

నిజాంసాగర్(జుక్కల్): రైతులు తమ పంటను దళారులకు, ప్రయివేటు వ్యక్తులకు విక్రయించొద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే అన్నారు. జుక్కల్ మండల కేంద్రంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జుక్కల్ మండల కేంద్రంలో గురువారం ఆయన శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శనగ పంట పండించిన రైతులకు అండగా నిలిచేందుకే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సాయాగౌడ్, సొసైటీ చైర్మన్ శివానంద్, నాయకులు మాధవ్‌రావ్‌దేశాయ్, రాములుసేట్, అనితాసింగ్, గంగునాయక్, ఉమాకాంత్ ఉన్నారు.

మద్నూర్ మండల కేంద్రంలో..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ యార్డులో గురువారం మద్నూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రభుత్వ శనగ కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ శ్రీనివాస్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తూకాలు వేసే కాంటలకు ఆయన పూజలు చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. శనగ క్వింటాలుకు రూ. 5335 ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని అన్నారు. సకాలంలో పంట డబ్బులు రైతుల ఖాతాలో డిపాజిట్ అవుతాయని పేర్కొన్నారు. రైతుల కోసమే ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. సర్పంచ్ సూర్యకాంత్, ఉప సర్పంచ్ విఠల్, నాయకులు రచ్చ కుషాల్, పండిత్‌రావ్ పటేల్, రాజు, శంకర్‌రావ్, గోపి, కార్యదర్శి బాబురావ్ రైతులు ఉన్నారు.

అనుమతిలేని మద్యం విక్రయిస్తే కేసులు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ

బిచ్కుంద(జుక్కల్): మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని అనుమతి లేకుండా వైన్స్, బెల్టు షాపులలో విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సంవత్సరంలో 107 కేసులను నమోదు చేశామని అన్నారు. 19 దేశిదారు కేసులు, లైసెన్సు లేకుండా కల్లు అమ్ముతున్న 3దుకాణాలపై కేసు నమోదు చేశామన్నారు. ఒకటి గంజాయి మరొకటి మహారాష్ట్ర మద్యం, 3 గుడుంబా, 5 బెల్టు షాపులపై కేసులు చేశామన్నారు. 4 దేశిదారు, వైన్స్‌లో కల్తీ మద్యం, పర్మిట్ రూంలో నీళ్లు కలిపి మద్యం అమ్ముతుండగా 5 పర్మిట్ రూంలపూ కేసులు నమోదు చేశామన్నారు. అలాగే గంజాయి తరలిస్తున్న ఆటో, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. 58 కల్లు దుకాణాలలో శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లో పరిశీలించడం జరిగిందన్నారు. ప్రతీరోజు వైన్స్‌రూం, పర్మిట్‌రూం తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరించి పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎవరైన కల్తీ మద్యం, కల్లు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

పన్నులను వందశాతం వసూలు చేయాలి



జీపీ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీనివాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి వందశాతం పన్నులను వసూలు చేయాలని ఎంపీవో శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. మండలంలోని లింగంపల్లికలాన్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి రోజూ పారిశుధ్య పనులను చేయించాలన్నారు. సర్పంచ్ మణెమ్మ, కార్యదర్శి వనజ ఉన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామ సంఘాల వీవోఏలు మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాలని జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వీవోఏల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులకు సకాలంలో రుణాలను ఇప్పించాలని, సకాలంలో వసూలు చేయాలని సూచించారు. డీపీఎం రమేష్‌బాబు మాట్లాడుతూ.. మండలంలో ఫిష్ పాండ్, సోలార్ విద్యుత్‌ప్లాంట్ ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వీవోఏలు జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డిని సత్కరించారు. ఎంపీపీ రాజ్‌దాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుగంధ, స్త్రీనిధి రిజనల్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీఎంలు రాజేందర్, జగదీశ్, సీసీలు నారాయణ, రమేష్, దత్తు, రషీదు, కిషన్, సుజాత పాల్గొన్నారు.

రెండు అటవీశాఖ సెక్షన్లు ఏర్పాటు

నిజాంసాగర్(జుక్కల్): బాన్సువాడ అటవీశాఖ పరిధిలో ఉన్నతాధికారులు నూతనంగా నిజాంసాగర్, కోనాపూర్ సెక్షన్లు ఏర్పాటు చేశారు. అలాగే ఆయా సెక్షన్లకు సెక్షన్ అధికారుల పోస్టులు మంజూరు చేశారు. త్వరలో ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు.

బీజేపీ ఫ్లెక్సీల చించివేత

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని దుర్కి గ్రామంలో గురువారం నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్ వద్ద బీజేపీ ఫ్లెక్సీలను గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు చించివేశారు. బీజేపీ సమావేశంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని వారు వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని గ్రామస్తులను, బీజేపీ కార్యకర్తలను, బీఆర్ఎస్ కార్యకర్తలను సముదాయించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భిక్కనూరు: తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంఘీభావ యాత్రకు మద్దతుగా ర్యాలీ నిర్వహించామని కార్మికులు తెలిపారు. జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు శ్యామ్, ప్రధాన కార్యదర్శి స్వామి, నేతలు సిద్దరాములు, జావిద్, సురేందర్, నవీన్, ప్రభాకర్, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమాచారం..

'మోడల్ ప్రవేశ పరీక్ష' తేదీలు ఖరారు

బాన్సువాడ రూరల్: తెలంగాణ మోడల్ స్కూల్‌లో సీట్ల భర్తీ కోసం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షల తేదీలు ఖరారైనట్లు కొత్తాబాది మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫకీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 8 నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం ఏప్రిల్ 16న ఉదయం, 7నుంచి 10వ తరగతి వరకు మిగులు సీట్లకు అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు గడువును కూడా ఈనెల 22 వరకు పొడిగించారని, ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రైతులు ఆటో స్టార్టర్లను తొలగించాలి

మద్నూర్(జుక్కల్)/ఎల్లారెడ్డి: రైతులు బోరుమోటార్లకు అమర్చిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈలు అరవింద్, సత్యనారాయణలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటో స్టార్టర్లను తొలగించి ఆన్, ఆఫ్ స్టార్టర్స్‌లను వాడుకోవాలన్నారు. నిరంతరంగా విద్యుత్, బోరును వాడుతుండటంతో కరెంటు, నీరు వృథా అవుతుందన్నారు. వెంటనే రైతులు ఆటో స్టార్టర్లను తొలగించాలని తెలిపారు.

నేడు బాణాపూర్‌లో సీఎం జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డి/లింగంపేట: లింగంపేట మండలంలోని బాణాపూర్ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే సురేందర్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలందర్‌రెడ్డి, లింగంపేట మండల అధ్యక్షుడు దివిటి రమేశ్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బీఆర్ఎస్ నేతలు హాజరుకావాలని కోరారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



ఎల్లారెడ్డి: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎస్సై గణేష్ అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం మండలంలోని సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో క్రైంరేటు చాలా తగ్గిందన్నారు. సర్పంచులు అశోక్‌రెడ్డి, మహ్మద్ అబ్దుల్ అలీ, రవీందర్, సాయిరాం తదితరులు ఉన్నారు.

అన్నారంలో గ్రామ సభ



రాజంపేట: మండలంలోని అన్నారం గ్రామంలో గురువారం సర్పంచ్ మెగావత్ స్రవంతి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. పాఠశాలలోని పాత భవనంను తొలగించాలని, సీసీ రోడ్డు పనులు చేపట్టాలని తీర్మానించినట్లు సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ రవి, వార్డు సభ్యులున్నారు.

వాహన పన్నులను చెల్లించండి

కామారెడ్డి టౌన్: జిల్లాలోని లారీ ఓనర్స్ తప్పకుండా వాహన పన్నులను చెల్లించాలని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లను తీసుకోవాలని కామారెడ్డి రవాణ శాఖ అధికారులు అపర్ణ, సతీష్‌లు సూచించారు. జిల్లా కేంద్రంలోని కామారెడ్డి లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో గురువారం వారు వాహన యజమానులతో సమావేశం నిర్వహించారు. డ్రైవర్‌లు లైసెన్స్‌లు , వాహనాలకు ఇన్సూరెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. తమపై పన్నులు పేరిట ఆర్థిక భారం మోపవద్దని యజమానులు అధికారులను కోరారు. పన్నుల ధరలను తగ్గించాలని కోరారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏజాజ్ ఖాన్, కార్యదర్శి సలీం, షరీఫ్, మాజీదుల్లా, డీసీఎం వాహన అసోసియేషన్ అధ్యక్షుడు అధ్యక్షులు రాజిరెడి, కార్యదర్శి విట్టల్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

వాహన ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి

భిక్కనూరు: ట్రాలీఆటోలు, ప్యాసెంజర్ ఆటోలు, కమర్షియల్ వాహనాలకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని కామారెడ్డి ఏఎంవీఐలు రజని, అపర్ణ సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఎస్సై ఆనంద్‌గౌడ్‌తో కలిసి, వారు వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు రోజులు గడువు ఇస్తున్నామని ఈ గడువులోపల వాహనదారులు తమ వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించాలన్నారు. లేదంటే వాహనాలను సీజు చేయడంతో పాటు వాటి యజమానులపై, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. అధికలోడ్‌తో వెళ్తున్న వాహనాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు.





కామారెడ్డిలో మాట్లాడుతున్న రవాణా శాఖ అధికారులు.. భిక్కనూరు మండల కేంద్రంలో..

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ పోతారెడ్డి

దోమకొండ: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, వాటికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ పోతారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్, గుట్కా, సిగరేట్ వాడకం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గంజాయి కేసులో పట్టుబడితే 10 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా ఉంటుందన్నారు. ఎస్సై సుధాకర్, కళాశాల ప్రిన్సిపల్ జైపాల్ రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది జీవన్, జాకబ్, బాల్‌రాజు, శరత్, కళాశాల లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు భూ పంపిణీ చేపట్టాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

రాజంపేట: దళితులకు మూడు ఎకరాల భూమిని పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన పార్టీ శ్రేణులు, దళితులతో కలిసి మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుటు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడు ఎకరాల భూమి, పోడు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఐ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శి బాలరాజ్, మండల కార్యదర్శి బత్తుల ఈశ్వర్, గ్రామ కార్యదర్శి హన్మండ్లు, నాయకులు రాములు, శ్రీను, సాయిలు, లావణ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శివాలయంలో అన్నపూజ



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి శివాలయంలో గురువారం భక్తులు అన్నపూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అలాగే మహారాజ పోషకుల ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. నేడు ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు శివభిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు తెలిపారు.

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి రూరల్: మండలంలోని ఉగ్రవాయి గ్రామ శివారులోగల షిర్డీ సాయి ప్రేమ మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని నెమ్లి గ్రామంలో గల షిర్డి సాయి ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాగడ హారతి, మధ్యాహ్నం అన్నదానం, సాయత్రం పల్లకీసేవా కార్యక్రమాలను నిర్వహించారు.

22 నుంచి పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో ఈనెల 22 నుంచి 25వరకు పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 22న అమ్మవారి పంచలోహ విగ్రహ ఊరేగింపు, ధ్వజారోహణం, 23న బోనాల ఊరేగింపు, ప్రత్యేక హోమాలు, 24న ఐరండ్ల ఎదుర్కోలు, పెద్దిరాజు శ్రీదేవిల కల్యాణోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన, 25న అమ్మవారి బోనాలు తిరిగి ఇంటికి తీసుకెళ్లడం, వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తిరుమల్లేశ్వర ఆలయంలో రుద్ర హోమం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలోగల తిరుమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా రుద్రహోమం నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదుట ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ గ్రామంలోగల గోపాలస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. సదాశివనగర్‌కు చెందిన సనాతన భజన మండలి సభ్యులు ఆలపించిన కీర్తనలు ఎంతో ఆకట్టుకున్నాయి.

సంక్షిప్తం

లైబ్రరీకి పుస్తకాల వితరణ

మద్నూర్(జుక్కల్): మద్నూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దెబ్బడ్‌వార్ పవన్‌కుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం మొగా పాఠశాల బృందం ఆధ్వర్యంలో సర్పంచ్ సూర్యకాంత్ గ్రంథాలయానికి పోటీ పుస్తకాలను అందించారు. అలాగే లక్ష్మీనారాయణ గోశాలలో అతడి స్నేహితులు దాన, బెల్లం, గడ్డిని అందించారు.

పెద్దటాక్లీలో రక్తదాన శిబిరం

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని పెద్ద టాక్లీలో గురువారం బాన్సువాడ సెవెన్ హిల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పెద్ద టాక్లీకి చెందిన నర్సుగొండ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన 25 మంది యువకులు రక్తదానం చేశారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో మూడురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందగా, గురువారం అంత్యక్రియలు నిర్వహించినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని ఎవరూ గుర్తించకపోవడంతో కామారెడ్డి మున్సిపల్ సిబ్బంది సహకారంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. మృతుడు ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నామన్నారు.

పుస్తె మట్టెల వితరణ

కామారెడ్డి రూరల్: మండలంలోని తిమ్మక్‌పల్లి(కె) గ్రామంలో పేద కుటుంబానికి చెందిన యువతి వివాహం సందర్భంగా గురువారం వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్ పుస్తె మట్టెలు వితరణ చేశారు. నర్సన్నపల్లి జెడ్పీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ బుక్స్ వితరణ చేశారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గురువారం నుంచి పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేసేందుకు ఎస్ఎంసీ చైర్మన్ రాంరెడ్డి ముందుకు వచ్చారు. ఉదయం, సాయంత్రం విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు రాంరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన రాములు అనే రైతు ఇటీవల మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా తమ భూమి పోతుందనే బెంగతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు గురువారం గల్ఫ్ తెలంగాణ ఫోరం ప్రతినిధులు రూ.25వేల నగదును అందజేశారు. విండో చైర్మన్ సదాశివరెడ్డి, సురేందర్, అనిల్, కుమార్, సతీష్ ఉన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి విద్యుత్‌నగర్‌లోని అక్షయ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల పలువురు మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, మగ్గం, మేహంది డిజైన్‌లో శిక్షణ ఇచ్చారు. గురువారం శిక్షణ పూర్తిచేసుకున్న వారికి కౌన్సిలర్ కాసర్ల గోదావరి సర్టిఫికేట్లను అందజేశారు.శిక్షణ కోసం మళ్లీ బ్యాచ్ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ర్యాలీకి అనుమతించండి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో ఈ నెల 19న శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు రామారెడ్డి ఎస్సైకి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ సంజీవ్, నాయకులు సందీప్, శ్రీనివాస్, రమేష్‌రెడ్డి, నాగరాజు ఉన్నారు.